క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మంగళగిరి: నగరంలోని 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 8.30 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని బైపాస్ రోడ్ ఏరియా, ఆత్మకూరు, పెదవడ్లపూడిలో విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని, నగర ప్రజలు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ ప్రాంత పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లి, గుండిమెడ, కొలనుకొండ గ్రామాల్లో అత్యవసర విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, విద్యుత్ వినియోగదారులకు సహకరించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

జాతీయ సదస్సులో ఎస్‌ఆర్‌ఎం వీసీ ప్రసంగం

మంగళగిరి: ఈనెల 25, 26 తేదీల్లో ఢిల్లీలో జరిగిన ఇండస్ట్రీ 4.0 జాతీయ సదస్సులో ఏపీ ఎస్ఆర్ఎం విశ్వ విద్యాలయం ఉప కులపతి ఆచార్య మనోజ్ కుమార్ అరోరా పాల్గొన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న పలు యూనివర్సిటీల వైస్ చాన్సలర్లు ఈ సదస్సుకు హాజరయ్యారు. జీవితం- ఉపాధి అనే అంశంపై వైస్ చాన్సలర్ల నడుమ జరిగిన చర్చాగోష్టిలో ఏపీ ఎస్ఆర్ఎం వైస్ చాన్సలర్ మనోజ్ కుమార్ అరోరా మాట్లాడారు. నైపుణ్యాలతో విద్యను సమగ్ర పరచాల్సి ఉంటుందని, దీని వల్ల ఫలితాలు మెరుగ్గా ఉంటాయని పేర్కొన్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో ఏపీ ఎస్ఆర్ఎం వర్సిటీ యూజీ, పీజీ ప్రోగ్రాముల నిర్వహణ కోసం తయారు చేసుకున్న సమగ్ర భవిష్యత్తు ప్రణాళికను, ఏర్పరుచుకున్న లక్ష్యాలను వివరించారు. విద్యార్థులకు అందించే పాఠ్యాంశాల్లో 21వ శతాబ్దపు నైపుణ్యాలు, సహ పాఠ్య విభాగాలు, ఉన్నత విద్య, సామాజిక సేవలు, ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్‌లు , క్షేత్రస్థాయి చదువులు అంతర్భాగంగా ఉంటాయని పేర్కొన్నారు. సమగ్ర పాఠ్యాంశాలు, క్రమశిక్షణ, సృజనాత్మకత, అంతర్జాతీయ సహకారం, సమగ్రత వంటి కీలక అంశాలను ఆచార్య మనోజ్ కుమార్ అరోరా వివరించారు.

పాఠశాలకు కుర్చీల బహూకరణ




తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండలం రేవేంద్రపాడు గ్రామంలోని కల్లూరి చంద్రమౌళి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వవిద్యార్థి 27 కుర్చీలను అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ మాట్లాడుతూ 1976-77 సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు పాఠశాలకు తమ వంతు సాయం చేయాలని తలంచారు. దీంతో పూర్వ విద్యార్థుల్లో ఒకరైన ఎస్‌వీఆర్ ఎలక్ట్రిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత మాదాల వెంకటేశ్వరరావు 27 కుర్చీలు అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మాదాల రమేష్, మాదాల వెంకటేశ్వరరావు, గొర్నేని మధుసూదన్ ప్రసాద్, అన్నే శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు కుసుమకుమారి, రవికుమార్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకరించాలి



ఫిరంగిపురం: నుదురుపాడు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. పాఠశాల విద్యార్థుల కమిటీ చైర్మన్ జె.మస్తాన్‌వలి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. అనంతరం పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మి పాల్గొన్నారు.

తాగునీటి బావికి మరమ్మతులు



ఫిరంగిపురం: పొనుగుపాడు బీసీ కాలనీలోని రజకవాడలో మూడేళ్లుగా పాడుబడి ఉన్న తాగునీటి బావికి అధికారులు మరమ్మతులు చేశారు. రెండురోజుల కిందట గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికులు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్‌కు ఈ సమస్యను వివరించడంతో ఆయన సొంత నిధులు కేటాయించి పనులు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. దీంతో బావి మరమ్మతు పనులు ప్రారంభించారు.

ప్రగతి కనవే

- నిడమర్రు రోడ్డుకు మహర్దశ
- చకచక విస్తరణ పనులు
- శరవేగంగా డంపింగ్ యార్డు తరలింపు



విస్తరణ పనులు వేగంగా జరుగుతున్న నిడమర్రు రోడ్డు

మంగళగిరి: మంగళగిరి నుంచి రాజధాని అమరావతి, తుళ్ళూరు, తాడికొండ మండలాలకు వెళ్లే ప్రధాన రహదారి నిడమర్రు రోడ్డుకు మహర్దశ పట్టింది. మంగళగిరి రైల్వేగేటు నుంచి తాడికొండ మండలం పెదపరిమి వరకు రూ.24 కోట్లతో చేపట్టిన ఈ రోడ్డు విస్తరణ పనులు వేగంగా సాగుతున్నాయి. మంగళగిరి-తాడేపల్లి నగరంగా అవతరించిన అనంతరం జాతీయ రహదారి వెంట, నిడమర్రు రోడ్డు వెంట ఊరు విస్తరిస్తోంది. ముఖ్యంగా నిడమర్రు రోడ్డులోని అమరావతి టౌన్‌షిప్‌లో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం ఉంది. ఇదే ప్రాంతంలో సీఆర్డీఏ ఆధ్వర్యంలో మధ్యతరగతి ప్రజల కోసం వైఎస్సార్ జగనన్న కాలనీ ఏర్పాటు చేసి ప్లాట్ల విక్రయం చేపట్టారు. ఈ ప్లాట్ల కొనుగోలుకు విశేష స్పందన లభిస్తోంది. ఇదే రోడ్డులో పలు విద్యాసంస్థలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ ప్రాంతంలో అమరావతి టౌన్‌షిప్ అభివృద్ధికి అడ్డంకిగా ఉన్న డంపింగ్ యార్డును అక్కడి నుంచి తరలించే ప్రక్రియను ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) చొరవతో చేపట్టారు. ఈ పనులు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో కొద్ది రోజులుగా సాగుతున్నాయి.

డంపింగ్ యార్డు స్థానే పార్కు!

నెల రోజుల్లో డంపింగ్ యార్డును అక్కడి నుంచి తరలించి ఆ స్థలంలో అందమైన పార్కును నిర్మించి పచ్చదనంతో తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే ఆర్కే నగరపాలక సంస్థ అధికారులకు సూచించారు. దీంతో పార్కు ఏర్పాటుతోపాటు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మించి పిల్లల ఆట పరికరాలు సమకూర్చాలని అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

రైల్వే గేటు వద్ద ఫ్లైఓవర్ నిర్మాణానికి ప్రతిపాదనలు

నిడమర్రు రోడ్డు విస్తరణకు ప్రధాన అడ్డంకిగా ఉన్న రైల్వే గేటు వద్ద ఫ్లైఓవర్ నిర్మాణానికి కేంద్రప్రభుత్వం రూ.92 కోట్లు కేటాయించింది. కొద్ది రోజులలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.



నిడమర్రు రోడ్డులో కొనసాగుతున్న వంతెన నిర్మాణం

జాతీయ రహదారి నిర్మాణం వేగంగా..

మరో వైపు నిడమర్రు రోడ్డు మీదుగా చినకాకాని నుంచి కృష్ణా జిల్లా గొల్లపూడి వరకు ప్రభుత్వం చేపట్టిన జాతీయ రహదారి నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. నిడమర్రు రోడ్డులో వెళ్లే వారికి ఇబ్బంది లేకుండా వంతెన నిర్మాణమూ కొనసాగుతోంది. జాతీయరహదారి నిడమర్రు, నవులూరు, యర్రబాలెం, తుళ్ళూరు మండలం మందడం, వెంకటపాలెం గ్రామాల మీదుగా కృష్ణా నదిపైన నిర్మించనున్న వంతెనకు చేరుతుంది. జాతీయరహదారి నిర్మాణంతో నిడమర్రు రోడ్డు వెంబడి, నవులూరు, యర్రబాలెం ప్రాంతాలలో కొద్ది రోజులుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకుంది.

రోడ్ల విస్తరణతోనే అభివృద్ధి

నగరం వేగంగా విస్తరించడంతో రోడ్ల విస్తరణ అవసరం. అందుకే ఇప్పటికే నగరంలోని పలు రోడ్ల విస్తరణ పనులు చేపట్టాం. నిడమర్రు రోడ్డు మరింత అభివృద్ధి చెందేందుకు ఎన్నో అవకాశాలు ఉన్నాయి. రానున్న రోజులలో నగరానికి ప్రధాన రహదారిగా ఇది అవతరించనుంది. రూ.24 కోట్లతో చేపట్టిన ఈ రోడ్డు విస్తరణ పనులు వేగంగా సాగుతున్నాయి.

– ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ఎమ్మెల్యే

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)



స్కేటింగ్ చేస్తున్న చిన్నారులతో ఎమ్మెల్యే ఆర్కే

మంగళగిరి: మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) సూచించారు. నగరంలోని తెనాలి రోడ్డు గుంటూరు కెనాల్ వద్ద పంప్ హౌస్ ఆవరణలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను శుక్రవారం ఎమ్మెల్యే ఆర్కే నగర పాలక సంస్థ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల చివరి నాటికి స్కేటింగ్ రింక్, ఇండోర్ స్విమ్మింగ్ పూల్ నిర్మాణాలను పూర్తి చేసి నగర ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని సూచించారు. ఈ సందర్భంగా స్కేటింగ్ చేసేందుకు వచ్చిన చిన్నారులతో కొద్దిసేపు గడిపి వారికి కావాల్సిన సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, నగర పాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్ జన నినాదం

– ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి



జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొన్న ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి

మంగళగిరి: జగనన్నే మా భవిష్యత్ అనేది జన నినాదమని, దేశంలో ఎవరూ చేయలేని అభివృద్ధి కార్యక్రమాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేశారని ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి కొనియాడారు. శుక్రవారం నగరంలోని 15వ వార్డు 9వ సచివాలయం పరిధిలో జరిగిన జగనన్నే మా భవిష్యత్- మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో చిరంజీవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. అనంతరం మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను దిగ్విజయంగా అమలు చేస్తున్నామని, తమ సర్కారు చేసిన పనులను చెప్పుకోవడానికి ధైర్యంగా ఇంటింటికీ వస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలకు ఏం చేశారో చెప్పుకోలేని స్థితిలో కొన్ని పార్టీల నేతలు ఉన్నారని ప్రతిపక్షాలను ఎద్దేవా చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబును ప్రజలు నమ్మే స్థితిలో లేరని, గతంలో ఆయన చేసిన మోసాలను వారు మరిచిపోలేదని పేర్కొన్నారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి అనూహ్య స్పందన వస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కలకోటి స్వరూపరాణి, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు కలకోటి బోయేజు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

మాటపై నిలబడే వ్యక్తి సీఎం జగన్

- నూరుశాతం హామీలు అమలు చేస్తున్న ఘనత ఆయనది
- మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా



తుళ్ళూరులో ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టినా

తాడికొండ: ఇచ్చిన మాటమీద నిలబడే వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్న ఘనత ఆయనదని ఉమ్మడి గుంటూరు జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా చెప్పారు. తుళ్ళూరు అయ్యన్న చెరువు ప్రాంతంలో శుక్రవారం జగనన్నే మా భవిష్యత్- మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. నాలుగేళ్లలో ప్రతి గడపా పొందిన లబ్ధిని వెల్లడించారు. గృహాలకు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్‌ను అంటించారు. అనంతరం క్రిస్టినా మాట్లాడుతూ రాజధాని ప్రాంతంలో ప్రతి ఒక్కరూ జగనన్న ముఖ్యమంత్రి కావాలని కోరకుంటున్నారని, సంక్షేమ పథకాలు అందించడంతోపాటు రాజధానిలో గత ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతూ అదనంగా భూమిలేని పేదలకు పింఛన్ పెంచేందుకు నిర్ణయం తీసుకోవడం జగనన్న చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు ఆలోకం సురేష్, మండల ఎస్సీ, ఎస్టీ సెల్ అధ్యక్షులు శృంగారపాటి సందీప్, పాలపర్తి రామారావు, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి కొప్పుల శేషగిరిరావు, మండల జేసీఎస్ కన్వీనర్ బండి ప్రసాద్, స్థానిక నాయకులు టి.రమణారెడ్డి, నేలపాటి నాగేంద్ర, ఆరేపల్లి జోజి పాల్గొన్నారు.

– తాడికొండ జయభారత్ కాలనీలో నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్ – మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తాడికొండ, నిడుముక్కల, కంతేరు సర్పంచ్‌లు తోకల సరోజినీ, మాదాసు రత్నకుమారి, బెజ్జం మహేష్ బాబు, ఉప సర్పంచ్ ఉయ్యూరు వెంకటరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్ళ శ్రీనివాసరెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్ దాసరి రాజు, ఎంపీటీసీలు ధూళిపాళ్ళ నాగేశ్వరరావు, పాలడుగు దాసు, సీనియర్ నాయకులు మల్లంపాటి రాఘవరెడ్డి, జిల్లా ఎస్టీ సెల్ కార్యదర్శి తోకల నరసింహారావు, మండల యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ళ హనుమంతరావు, మీర్జా వలి, ఎస్సీ సెల్ నాయకులు బోడపాటి ధర్మరాజు, బాకి వెంకటస్వామి, మాదాసు ఏసురత్నం, కొదమల విజయ కుమారి, కేశం వసంత కుమారి పాల్గొన్నారు.



తాడికొండలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో పాల్గొన్న కత్తెర సురేష్ కుమార్

కార్పొరేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు



తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఈ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆర్కే సూచనల మేరకు కార్పొరేషన్ పరిధిలో ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో కార్పొరేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేశామని, రెండు పట్టణాలతో పాటు విలీన గ్రామాలతో కలిపి మొత్తం 38 చలివేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించారు.

బిందు సేద్యాన్ని ప్రోత్సహించాలి

– ఏపీఎంఐపీ ఓఎస్‌డీ పద్మావతమ్మ



నూతక్కి(మంగళగిరి): రైతులకు బిందు సేద్యం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించి ఆ దిశగా ప్రోత్సహించాలని ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ సేద్య ప్రాజెక్ట్(ఏపీఎంఐపీ) ఓఎస్‌డీ బి.పద్మావతమ్మ తెలిపారు. నగర పరిధిలోని నూతక్కిలో శుక్రవారం పంటలను పరిశీలించి పరికరాల వినియోగం, మందులు, ఎరువులు పంటలకు వేసే విధానంపై వివరించారు. అనంతరం వీఏఏలు, వీహెచ్ఏలకు ఈ క్రాప్ బుకింగ్‌పై వివరించారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ అధికారులు ఎల్. జయశ్రీ, దీపిక తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ అకాడమీ డైరెక్టర్ ఆకస్మిక తనిఖీ



మేడికొండూరు: మేడికొండూరులోని ఏపీ స్టేట్ ఉర్దూ అకాడమీ లైబ్రరీని ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అండ్ సెక్రటరీ ఎస్.అయ్యూబ్ హుస్సేన్ శుక్రువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఉర్దూ భాష, కమిటీ అభివృద్ధి గురించి సూచనలు చేశారు. ముస్లింల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని వివరించారు. అనంతరం ఉర్దూ ప్రాథమిక పాఠశాలను సందర్శించి అక్కడ భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యాబోధన వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఎమ్మెల్యే ఆర్కే ఆపన్న హస్తం



బాధితురాలికి నిత్యావసర సరకులు అందజేస్తున్న స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు

మంగళగిరి: సోషల్ మీడియాలో వచ్చిన కథనానికి స్పందించిన ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) పేద దంపతులకు మూడు నెలలకు సరిపడా బియ్యం, నిత్యావసర సరకులు అందజేశారు. కొద్ది రోజుల క్రితం ఏడు నెలల చిన్నారితో కలిసి దంపతులు బోయ నాని లక్ష్మి బతుకుతెరువు కోసం నగర పరిధిలోని యర్రబాలేనికి వలస వచ్చారు. నాని భార్య లక్ష్మి మానసిక స్థితి సరిగా ఉండదు. నాని చిరుద్యోగం చేస్తుంటాడు. చాలీచాలని జీతంతో దంపతులు చిన్నారి పోషణకు ఇబ్బందులు పడుతున్నారంటూ శుక్రవారం సోషల్ మీడియాలో కథనం రావడంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఆర్కే మూడు నెలలకు సరిపడా బియ్యం నిత్యావసర సరకులను సమకూర్చారు. వీటిని స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు దంపతులకు అందజేశారు. పేద దంపతులు ఎమ్మెల్యే ఆర్కేకు కృతజ్ఞతలు తెలిపారు. నిత్యావసర సరకులు అందజేసిన వారిలో పార్టీ నాయకులు గుండాల శ్రీనివాసరావు, పలగాని కోటేశ్వరరావు, దానబోయిన నాగయ్య, రెమిడిశెట్టి గోపి, నాయుడు హనుమంతరావు, ఎస్‌కె షఫీ, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు మతిభ్రమించినట్టుంది

- మేడికొండూరు సభలో ఆయన వ్యాఖ్యలు హాస్యాస్పదం
- వైఎస్సార్ సీపీ నేత కత్తెర సురేష్‌కుమార్ ధ్వజం

తాడికొండ: అధికారం కోల్పోవడంతో టీడీపీ అధినేత చంద్రబాబుకు మతిభ్రమించినట్టుందని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ ఎద్దేవా చేశారు. గుంటూరు భారత్‌పేటలోని తాడికొండ నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మేడికొండూరు సభలో చంద్రబాబు వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని, 14 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా చేసిన బాబు ప్రజా సంక్షేమాన్ని మరిచారని, రాష్ట్రానికి శనిలా దాపురించారని ధ్వజమెత్తారు. రెండెకరాల నుంచి రూ.లక్షల కోట్లు దోపిడీ చేసే స్థాయికి ఎదిగారని, చంద్రబాబు రాజకీయాన్ని అడ్డుపెట్టుకొని దోచుకొని దాచుకోవడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలోనే ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంచి సీఎంగా ప్రజల గుండెల్లో స్థానం పదిలం చేసుకున్నారని సురేష్‌కుమార్ ప్రశంసించారు. రాజధాని పేరుతో దోపిడీ చేసిన చంద్రబాబు ఈ ప్రాంత ప్రజలను నిలువునా ముంచి ఓటమిపాలయ్యారని, ఆ విషయం గుర్తుంచుకుని మసలుకోవాలని లేకుంటే ప్రజలే తరిమికొడతారని హెచ్చరించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవలేక ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురిచేసిన చరిత్ర బాబుదని దుయ్యబట్టారు. బాబు ఎన్ని పొత్తులు పెట్టుకున్నా.. ఎన్ని కుతంత్రాలు పన్నినా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ 175 స్థానాల్లో విజయ ఢంకా మోగించడం ఖాయమని సురేష్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఫిరంగిపురం జెడ్పీటీసీ దాసరి కత్తిరేణమ్మ, మాజీ ఎంపీపీ కొమ్మినేని రామచంద్రరావు, రాఘవరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్ళ శ్రీనివాసరెడ్డి పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంగళగిరి బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా లెనిన్



బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లెనిన్‌బాబుకు అభినందనలు తెలుపుతున్న న్యాయవాదులు

మంగళగిరి: మంగళగిరి బార్ అసోసియేషన్ ఎన్నికలు శుక్రవారం ఉత్కంఠభరితంగా జరిగాయి. బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా జొన్నాదుల లెనిన్‌బాబు తన సమీప ప్రత్యర్థి వాకా రామ్ గోపాల్ గౌడ్‌పై 3 ఓట్ల మెజార్టీతో గెలిచారు. లెనిన్‌కు 61 ఓట్లు రాగా రామ్‌గోపాల్ గౌడ్‌కు 58 ఓట్లు లభించాయి. జనరల్ సెక్రటరీగా బేతపూడి నాయుడమ్మ 23 ఓట్ల మెజార్టీతో తన సమీప ప్రత్యర్థి మాలపల్లి సురేంద్రబాబుపై గెలిచారు. ఉపాధ్యక్షుని స్థానానికి జరిగిన పోలింగ్‌లో సత్యాల బాలశౌరికి 45 ఓట్లు, తోట నరసింహారావుకు 45 ఓట్లు, లంకపల్లి పెద్ద బుజ్జికి 34 ఓట్లు లభించాయి. టాస్ వేయగా తొలి ఆరు నెలలు బాలశౌరి, తదుపరి ఆరు నెలలు తోట నరసింహారావు ఉపాధ్యక్షులుగా వ్యవహరించనున్నారు. కోశాధికారిగా సూరబోయిన మురళీకృష్ణ 29 ఓట్ల మెజార్టీతో తన సమీప ప్రత్యర్థి బుల్లా పూర్ణచంద్రరావుపై విజయం సాధించారు. మురళికి 75 ఓట్లు రాగా పూర్ణచంద్రరావుకు 46 ఓట్లు లభించాయి. లేడీ సెక్రటరీ స్థానానికి నలుగురు పోటీ చేయగా కె. స్వరూప రాణికి 39 ఓట్లు, సింగంశెట్టి ఇందిరా ప్రియదర్శినికి 30 ఓట్లు, వింజమూరి భారతీదేవికి 30 ఓట్లు, టి.రాజ్యలక్ష్మికి 15 ఓట్లు లభించాయి. టాస్ వేయగా మొదటి ఆరు నెలలు స్వరూపరాణి, తదుపరి ఆరు నెలలు ఇందిరా ప్రియదర్శిని లేడీ సెక్రటరీగా వ్యవహరించనున్నారు. జాయింట్ సెక్రటరీగా రెంటపల్లి రాజేష్, లైబ్రరీ సెక్రటరీగా పి. సురేష్‌తో పాటు 10 మంది ఈసీ మెంబర్లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు కూర్మాల దుర్గాప్రసాద్, సహాయ అధికారులు టి.మధుసూదనరావు, టి.రోశయ్య తెలిపారు. మొత్తం 131 ఓట్లు ఉండగా 124 ఓట్లు పోలయ్యాయి. ఎన్నికల సందర్భంగా కోర్టు ప్రాంగణంలో కోలాహల వాతావరణం నెలకొంది.

తహసీల్దార్ కార్యాలయానికి ఇళ్లస్థల పట్టాలు



ఇళ్లస్థల పట్టాలను పరిశీలిస్తున్న తహశీల్దార్ నాగిరెడ్డి

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి మండల పరిధిలోని ఇళ్లస్థల లబ్ధిదారులకు శుభవార్త. శుక్రవారం తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయానికి 2005 ఇళ్ల స్థల పట్టాలు వచ్చాయి. వీటిని పరిశీలించేందుకు తహసీల్దార్ మర్రిరెడ్డి నాగిరెడ్డి ఆధ్వర్యంలో ఆయా సచివాలయాల పరిధిలోని వీఆర్‌వోలు, వీఆర్‌ఏలు సన్నద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో వీఆర్వోలు, వీఆర్‌ఏలతో తహసీల్దార్ సమావేశమయ్యారు. తాడేపల్లి రూరల్ పరిధిలో మొత్తం 2,505 మంది లబ్ధిదారులు ఉండగా ప్రస్తుతం 2005 పట్టాలు వచ్చినట్టు తహసీల్దార్ తెలిపారు. ఆ పట్టాలను వీఆర్వోలకు అందించి ఇంటింటికీ వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఏమైనా తప్పులు ఉంటే దిద్దుబాటు చర్యలు చేపడతామని వివరించారు. త్వరలోనే పట్టాలను లబ్ధిదారులకు అందిస్తామని వెల్లడించారు. సమావేశంలో డెప్యూటీ తహసీల్దార్ సతీష్, ఆర్‌ఐలు వంశీకృష్ణ, ప్రశాంతి పాల్గొన్నారు.

మణిపాల్‌లో ఓపీడీ సేవలు

తాడేపల్లి రూరల్: మణిపాల్ హాస్పిటల్‌లో అవుట్ పేషెంట్ డిపార్ట్‌మెంట్(ఓపీడీ) సేవలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఆ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ కంటిపూడి సుధాకర్ తెలిపారు. కీళ్లు, కండరాల సంబంధిత (రుమటాలజీ) సేవలను సోమవారం నుంచి శనివారం వరకు అందించనున్నట్టు తెలిపారు. వివరాలకు 08645669966, 18001025555 నంబర్లలో సంప్రదించవచ్చని వివరించారు.

ప్రియదర్శిని కళాశాల వార్షికోత్సవం



సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా నృత్య ప్రదర్శన ఇస్తున్న విద్యార్థిని

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండలం చింతలపూడి గ్రామంలోని ప్రియదర్శిని కళాశాల వార్షికోత్సవం, ఫేర్‌వెల్‌డే వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కళాశాల చైర్మన్ చందు రామారావు, చందు విజయలక్ష్మి, కళాశాల వైస్‌చైర్‌పర్సన్ రోహిణి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు మంచి క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉద్యోగ అవకాశాలు పొందాలని సూచించారు. కళాశాలలో మెకానికల్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం నిర్వహించిన వెంకట కృష్ణ అనారోగ్యంతో మృతి చెందగా లక్ష రూపాయలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ఆయన కుమార్తెకు అందజేశారు. అనంతరం ఆటలపోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆటల పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఓడీలు డాక్టర్ ఎ.శ్రీకాంత్ బాబు, లక్ష్మీ నారాయణ, రాఘవేంద్ర విష్ణు, బి.జీవన్‌కుమార్, సి.హెచ్.వెంకటేశ్వరరావు, ఎస్.కె.నాహీర్, సి.హెచ్.ఢిల్లీ పోలీస్, కె.కిరణ్‌కుమార్, కె.లలితబాబు పాల్గొన్నారు.

పసుపు రైతు సదస్సును జయప్రదం చేద్దాం



పసుపు కల్లాలను పరిశీలిస్తున్న రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు తదితరులు

తాడేపల్లిరూరల్ : పసుపు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, రూ.పది వేల మద్దతు ధర ఇవ్వాలని కోరుతూ మే 3న దుగ్గిరాల పసుపు యార్డు వద్ద నిర్వహించనున్న పసుపు రైతు రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం కుంచనపల్లి గ్రామంలో రైతు సంఘం నాయకులు సదస్సుపై విస్తృత ప్రచారం చేపట్టారు. పసుపు కల్లాలను పరిశీలించారు. శివశంకరరావు మాట్లాడుతూ పసుపు రైతులు సదస్సులో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, అమ్మిశెట్టి రంగారావు, రామారావు, బిరుదుగడ్డ ప్రసాద్ రైతులు పాల్గొన్నారు.